సెప్టెంబర్ 17
75 వ తెలంగాణ స్వాతంత్ర్య దినోత్సవ
శుభాకాంక్షలతో

600 సంవత్సరాల
ఇస్లామిక్ రాజ్య
పాలన నుండి
75 వసంతాల
స్వేచ్ఛాస్వాతంత్ర్య
ఊపిరిలూదుతున్న
స్వతంత్ర తెలంగాణ
పరిశోధనాత్మక వ్యాసాలను
ఆహ్వానిస్తున్నాం
మీ ఆర్టికల్స్ ను పంపండి 9542226669

Organized By :
జనగొంతు తెలుగు దిన పత్రిక

కాకతీయ సామ్రాజ్య సామంత రాజులు నందగిరి సంస్థానం స్థాలకొండ దేశాయి ల శాజన్యంతో
750 - 132B AD

JANAMGONTHU TELUGU DAILY

జనంగొంతు

Online:- https://janamgonthu.in
"https://epaper.janamgonthu.in

తెలుగు దినపత్రిక

కావలెను

జనం గొంతు

తెలుగు దిన పత్రికకు
బ్యూరో ఇన్-చార్జ్, స్టాఫ్ రిపోర్టర్
మండలాల వారిగా
విలేఖరులు కావలెను

సంప్రదించు: 9542226669

కరీంనగర్ సంపుటి : 10 సంచిక : 250 | మంగళవారం 09-06-2026 | 4 పేజీలు | వెల 2/-

ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా పోస్టర్లు, హోర్డింగులు..

(హైదరాబాద్)

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే కాకుండా, ఈ ఏడాది విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా సాగుతోంది. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12వ తేదీన పాఠశాలలు రీ ఓపెన్ కానున్న నేపథ్యంలో.. బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే బడిబాట కార్యక్రమం ద్వారా ప్రతి పాఠశాలలో పది శాతం విద్యార్థుల నమోదు పెంచాలని జిల్లా కలెక్టర్లతో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో ప్రభుత్వ స్కూళ్ల ప్రత్యేకతలను వివరిస్తూ టీచర్లు పెద్ద ఎత్తున పోస్టర్లు, హోర్డింగులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్కూళ్లలో అందుబాటులో ఉన్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, డిజిటల్ క్లాసులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన వంటి అంశాలను వివరిస్తూ తల్లిదండ్రులలో అవగాహన కల్పిస్తున్నారు. బడి మానేసిన పిల్లలు, అంగన్‌వాడీ పిల్లలను గుర్తించి వారిని బడిబాట పట్టించేలా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

సాంకేతికతను వాడుకుంటూ ఉపాధ్యాయులు సరికొత్త పంథాలో ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి.. వాటి ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులను మోటివేట్ చేస్తున్నారు. ఆడియోలు, వీడియోలు, బడిబాట కరపత్రాలను గ్రూపుల్లో షేర్

చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఇందుకోసం ఏఐని కూడా వినియోగిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల పెరగడానికి ఈ ఏడాది మరో సరికొత్త ఆకర్షణ తోడైంది. విద్యార్థుల ఆరోగ్యం, పౌష్టికాహారాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెడుతున్నది. మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయాన్నే వేడి వేడి రుచికరమైన అల్పాహారం కూడా లభించనుండటంతో దూరం నుంచి స్కూళ్లకు వచ్చే విద్యార్థులకు ఆకలి బాధలు తగ్గనున్నాయి. ఈ వినూత్న కార్యక్రమాలు, ఉపాధ్యాయుల నిరంతర కృషితో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు రికార్డు స్థాయిలో నమోదవుతాయని విద్యాశాఖ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 12న విద్యార్థులకు స్వాగతం పలికేందుకు పాఠశాలలు సిద్ధమవుతున్నాయి.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి : మంత్రి సీతక్క

(ములుగు)

ఈ నెల 15 నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న దృశ్య విద్యార్థినీ విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేసి నాణ్యమైన విద్యను, పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మంత్రి హైదరాబాద్ నుంచి సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్లు సి. హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి పాఠశాల, వసతి గృహంలో అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని విద్యాసంస్థల భవనాలు, తరగతి గదులు, వసతి గృహ గదులు, వంటశాలలు, భోజనశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకులను పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నివారణ కోసం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

అధికారులు వసతి గృహాలు, పాఠశాలలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, సామాజిక సేవా, సంస్కృతి, సంప్రదాయాలు, మంచి అలవాట్లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. "సమస్కారం -- మన సంస్కారం" అనే భావనను విద్యార్థుల్లో

పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడానికి కృషి చేసిన జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పాఠశాలల్లో వైద్య శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డీఆర్ఓ రవి కుమార్, ఆర్డీవో కృష్ణవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు దార్శనిక దేవాలయాలు : డిప్యూటీ సీఎం భట్టి

(ఖమ్మం)

రాష్ట్రంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు కేవలం భవనాలు కావని, అవి రేపటి తరాన్ని ఉజ్వలంగా తీర్చిదిద్దే 'దార్శనిక దేవాలయాలు' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభివర్ణించారు. విద్యకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ పరిధిలోని బోనకల్లు మండలం లక్ష్మీపురంలోని ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాణ్యతతో.. వేగంగా పూర్తి చేయాలి నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలలోని భవన సముదాయాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాలినడకన తిరుగుతూ క్షుణ్ణంగా పరిశీలించారు. జూనియర్ హాస్టల్, జూనియర్, సీనియర్ విభాగాలు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణ ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వేదికలుగా నిలిచే మెకానికల్, సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ ల్యాబ్ భవనాల పనులను ప్రత్యేకంగా పరిశీలించారు.

పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, నిబంధనల ప్రకారం అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. పనులను మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారులను (కాంట్రాక్టర్లను) ఆదేశించారు. ఆలోచనే ఒక పెట్టుబడి.. విద్య కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి.. కేవలం వ్యయం కాదు, అది రాబోయే భవిష్యత్ తరాలను శక్తివంతంగా నిర్మించడం కోసం పెట్టే అద్భుతమైన పెట్టుబడి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లక్ష్మీపురం స్కూల్ ఆవరణ అంతా తిరుగుతూ గదులలోగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారులకు డిప్యూటీ సీఎం స్పష్టంగా చెప్పారు.

రాష్ట్రంలో మా ప్రభుత్వం వస్తే ఆదాయ పన్ను కడతాం..

(హైదరాబాద్)

నూతన భారత నిర్మాణంలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇవాళ హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ ఎఫ్ఎన్‌సీసీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో కోల్ అంటే స్కామ్, అవినీతి, అనిశ్చితికి కేరాఫ్‌గా ఉండేదని కామెంట్ చేశారు. యూపీఏ సర్కార్ హయాంలో బొగ్గు గనుల మంత్రి జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. రూ. 1.86 లక్షల కోట్ల బొగ్గు స్కామ్ జరిగిందని కాగ్ అప్పట్లో నివేదిక ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కేటాయించిన కోల్ మైన్స్‌ను కూడా సుప్రీంకోర్టు రద్దు చేసిందని అన్నారు. కానీ, గత 12 ఏళ్లలో అవినీతి అనేదే లేకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం దేశంలో 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని అన్నారు. అండర్ గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం చేస్తున్నామని, కోల్ గ్యాసిఫికేషన్‌పై 11న ప్రైవేటు కంపెనీలతో చర్చిస్తామని వెల్లడించారు. 2028 నాటికి దేశంలో అన్ని కోల్ బ్లాక్‌లను మూసేస్తామని స్పష్టం చేశారు. క్రిటికల్ మినరల్స్ మిషన్ ప్రోగ్రామ్‌కు రూ. 1,500 కోట్లు మంజూరు చేశామని, ఇప్పటి వరకు 24 క్రిటికల్ మినరల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నామని అన్నారు. అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్స్ బ్లాక్స్ తీసుకున్నామని పేర్కొన్నారు. ఒకవేళ తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం వస్తే.. సింగరేణి కార్మికుల ఆదాయ పన్నును కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని బంపరాఫర్ ఇచ్చారు.

బీరుట్‌పై ఇజ్రాయిల్ దాడులు

ఇరాన్ డ్రోన్లను కూల్చివేత.. పశ్చిమాసియాలో ఆగని ఉద్రిక్తతలు

(దిల్లీ)

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ దాడులు, ప్రతి దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం ఇజ్రాయిల్ సేనలు లెబనాన్‌పై దాడులు కొనసాగిం చగా, అమెరికా ఇరాన్ డ్రోన్‌లను కూల్చివేసింది. మరోవైపు కువైట్, బహ్రైన్‌లలో ఉన్న అమెరికా స్థావరాలపై క్షిపణులతో ఇరాన్ ప్రతిదాడి చేసింది.

లెబనాన్‌లో రాజధాని బీరుట్‌పై ఇజ్రాయిల్ సేనలు దాడులను ఉధృతం చేశాయి. మార్చి 2 నుంచి లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరిపిన ఘోరమైన దాడుల్లో దాదాపు 3,613 మంది మృతి చెందారని, వేలాది మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇజ్రాయిల్, హిజ్బుల్లా మధ్య ఇటీవలే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ దాడులు ఏ మాత్రం ఆగడం లేదు. దక్షిణ లెబనాన్‌లో ఓ సైనిక వాహనంపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో ఇద్దరు లెబనాన్ సైనికాధికారులు, ఓ సైనికుడు మరణిం చారు. నబాటియే జిల్లాలో జిప్తా రోడ్డుపై ఒక మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిపై దాడి చేసి హత్య చేసింది. దుబాయ్ పట్టణంలోని ఘమికా పరిసర ప్రాంతంలో నివాస ప్రాంతాలపై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు దాడులు చేసి ధ్వంసం చేశాయి.

హర్మూజ్ జలసంధిలో ఇరాన్‌కు చెందిన డ్రోన్‌లను కూల్చివేశామని అమెరికా ప్రకటించింది. జలసంధికి ముప్పు కల్గిస్తున్నాయని అందుకే వాటిపై దాడి చేసామంటూ అమెరికా అధికారులు పేర్కొన్నారు. అయితే అమెరికా తరచూ తన వైఖరిని మార్చుకుంటూ దాడులు చేస్తుందని, పరస్పర విరుద్ధ వైఖరులు అవలంబిస్తోందని, అందుకే శాంతి చర్చలు ముందుకు సాగడం లేదని ఇరాన్ విమర్శించింది. ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై టెహ్రాన్‌లో ఒక

వార్తా సంస్థతో మాట్లాడుతూ పాకిస్తాన్ మధ్యవర్తుల ద్వారా అమెరికాతో సందేశాలు పంచుకుంటున్నామని చెప్పారు. 'వైఖరులను తరచూ మార్చుకుంటున్న కారణంగానే ట్రంప్ ప్రభుత్వంతో చర్చలు జరపడం ఇబ్బందిగా ఉంది. లక్ష్యాలను మార్చుకోవడం, విభిన్న ప్రకటనలు చేయడం, అధికారులు పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యలు చేయడం... ఇవన్నీ చర్చలకు ప్రతిబంధకంగా ఉన్నాయి' అని అన్నారు. ఇరాన్ హక్కులను గుర్తించాలన్న విషయాన్ని అమెరికన్లు అర్థం చేసుకోవాలని, అదే ప్రధాన విషయమని తెలిపారు. అంతర్జాతీయ అణ్వాస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం కింద శాంతియుత అణు శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఇరాన్‌కు హక్కు ఉన్నదని విషయాన్ని కూడా వారు గ్రహించాలని చెప్పారు. 'అదే సమయంలో స్తంభింపజేసిన మా ఆస్తుల గురించి అడుగుతుంటే వారు ఎలాంటి రాయితీలు ఇవ్వడం లేదు' అని అన్నారు.

సైబర్ నేరాల్లో ట్రేడింగ్ ఫ్రాడ్‌లదే అగ్రస్థానం..

ఏకంగా రూ.139 కోట్లకు కుచ్చుటోపీ

(హైదరాబాద్)

అరచేతిలోని స్మార్ట్‌ఫోనే ఆయుధంగా.. ప్రజల అత్యాశ, భయమే పెట్టుబడిగా సైబర్ కేటుగాళ్లు చెలరేగిపోతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న అత్యాశ అమాయకులను నిలువునా ముంచుతోంది. 2026 సంవత్సరం తొలి 5 నెలల (జనవరి-మే) వ్యవధిలో నమోదైన సైబర్ నేరాలను విశ్లేషిస్తే.. ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ స్కామ్‌లదే అగ్రస్థానం కావడం గమనార్హం. ఒకవైపు పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా.. భారీ లాభాలంటూ ఊరించే ప్రకటనలకు ఆకర్షితులై ప్రజలు తమ జీవితకాల సంపాదనను సైబర్ నేరగాళ్ల చేతిలో పెడుతున్నారు. పెట్టుబడి మోసాలు, పోలీసులు, ఈడీ, సీబీఐ అధికారులమంటూ భయపెట్టి డబ్బులు గుంజే డిజిటల్ అరెస్ట్‌లు, ఫేక్ జాబ్ ఆఫర్లు, మ్యాట్రిమోనియల్ స్కామ్‌లు, యూపీఐ మోసాలు ఇలా.. 2024లో రాష్ట్రవ్యాప్తంగా 27,230 సైబర్ కేసులు నమోదయ్యాయి. 2025-26 నాటికి కేసుల సంఖ్య కాస్త తగ్గినా మోసాల తీవ్రత, పోగొట్టుకుంటున్న సొమ్ము మాత్రం పెరుగుతుండటం విస్మయపరుస్తోంది. అయితే, ఈ నేరాలను కట్టడి చేసేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, హైదరాబాద్ సిటీ పోలీసులు ఆపరేషన్ ఆక్టోపస్ పేరిట దేశవ్యాప్తంగా జల్లెడ పడుతూ వందలాది మంది కేటుగాళ్లను అరెస్ట్ చేస్తున్నారు.

కోట్లలో లావాదేవీలు.. కేవలం ఫిబ్రవరి నెలలోనే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో 78 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ కేసులను ఛేదించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ ఆక్టోపస్ పేరిట భారీ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. దేశవ్యాప్తంగా ఏకంగా 16 రాష్ట్రాల్లో జల్లెడ పట్టి 74 సైబర్ కేసులకు సంబంధించి 117 మంది అంతర్రాష్ట్ర నేరగాళ్లను అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చారు. దర్యాప్తులో విస్మయపరిచే నిజాలు వెలుగుచూశాయి. ఇప్పుడు అరెస్టయిన ఈ 117 మందిపై దేశవ్యాప్తంగా ఏకంగా 1,081 సైబర్ కేసులు ఉన్నట్లు తేలింది. వీరి బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే సుమారు రూ.139 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్టు పోలీసులు గుర్తించారు.

ట్రేడింగ్ మోసాలు.. పోలీసులు ఛేదించిన కేసుల్లో అత్యధిక వాటా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లదే కావడం ఆందోళన కలిగిస్తోంది. ఛేదించిన 74 కేసుల్లో ఏకంగా 63 కేసులు కేవలం ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లకు సంబంధించినవే కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. దీని తర్వాతి స్థానాల్లో పోలీసులు, ఈడీ, సీబీఐ అధికారులమంటూ భయపెట్టి డబ్బులు గుంజే డిజిటల్ అరెస్ట్ లు 6 కేసులు, ఓటీపీ ఫ్రాడ్స్ 4, సోషల్ మీడియా ఫ్రాడ్ 1 ఉన్నాయి. అరెస్టయిన ఈ నేరగాళ్ల వద్ద నుంచి పోలీసులు రూ.36 లక్షల నగదుతో పాటు 221



మొబైల్ ఫోన్లు, 26 ల్యాప్‌టాప్‌లు, 141 సిమ్‌కార్డులు, 115 చెక్‌బుక్కులు, 54 డెబిట్ కార్డులు, 56 షెల్ కంపెనీల స్టాంపులు, 152 పాస్‌బుక్కులను సీజ్ చేశారు. ఈ కేసుల దర్యాప్తులో భాగంగా ఫిబ్రవరిలో రూ.34.76 లక్షలను బాధితులకు తిరిగి రీఫండ్ చేయించారు. మరోవైపు సైబర్ సెల్స్‌కు 2,963 సైబర్ ఫిర్యాదులు రాగా, 461 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దేశవ్యాప్తంగా ఆపరేషన్లు చేపట్టి 11 మంది నిందితులను అరెస్టు చేశారు. బాధితులకు మరో రూ.24.10 లక్షలు మొత్తం కలిపి సుమారు రూ. 59 లక్షలు తిరిగి ఇప్పించారు. పోలీసులు నిరంతర ఆన్‌లైన్ నిఘా ద్వారా.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అక్రమ ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న 539 ప్రకటనలను,124 ఫేక్ ప్రొఫైల్స్‌ను గుర్తించి వాటిని శాశ్వతంగా తొలగించారు.

ఇలా ఫిర్యాదు చేయండి.. సాంకేతికతను ఎంత పకడ్బందీగా ఉపయోగిస్తున్నా, అవగాహనా కార్యక్రమాలు ఎన్ని చేపడుతున్నా.. సైబర్ నేరాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడాలంటే ప్రజల స్వీయ జాగ్రత్తే కీలకం. ఫేక్ మ్యాట్రిమోనియల్ ప్రొఫైల్స్, ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపులు, డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్స్ పట్ల ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. గ్యారెంటీ రిటర్న్స్, అధిక లాభాలు అని చెప్పే ఆఫర్లను గుడ్డిగా నమ్మొద్దు, ఓటీపీలు, బ్యాంక్ డీటెయిల్స్ ఎవరికీ చెప్పకూడదు. రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ చట్టవిరుద్ధం, అందులో పాల్గొంటే చట్టపరమైన చర్యలు తప్పవు. సైబర్ మోసం జరిగిందని అనుమానం వచ్చిన వెంటనే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలి. లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలి. మోసం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్ లో ఫిర్యాదు చేస్తే పోయిన డబ్బును నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లకుండా ఫ్రీజ్ చేసి, తిరిగి రికవరీ చేసే అవకాశం ఉంది.

జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఆర్డీవో షర్మిల

(కరీంనగర్)

కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా బాధ్యతలు స్వీకరించిన షర్మిల జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షర్మిల జిల్లా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పరిపాలన, రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. కాగా, షర్మిల శనివారం కరీంనగర్ ఆర్డీవోగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు జిల్లా అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రక్తదానం చేసిన సభ్యులను అభినందించిన చందన సుధాకర్

మంచిర్యాల

అత్యవసర పరిస్థితిలో రక్తం అవసరమైన బాధితులు మెడికల్ అండ్ హెల్త్ వింగ్ డి సి సి ని సంప్రదించగా వెంటనే స్పందించిన మెడికల్ అండ్ హెల్త్ వింగ్ కమిటీ సభ్యులు పవన్ కల్యాణ్, సంతోష్,శ్రీకాంత్ రక్తదానం చేసి ప్రాణరక్షణకు తోడ్పడ్డారని మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ చైర్మన్ డాక్టర్ చందన సుధాకర్ లు తెలిపారు.రక్తదానం చేసిన సభ్యులను అభినందించి, వారి సేవ భావాన్ని ప్రశంసించారు. అలాగే అత్యవసర సమయాల్లో ప్రజలకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు మంచిర్యాల జిల్లా లోని మెడికల్ అండ్ హెల్త్ వింగ్ ఎల్లపుడు సిద్ధంగా ఉంటుందని.డాక్టర్ చందన తెలిపారు,రక్తదానం మహాదానం,అని యువత ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించిన స్థానిక ఎమ్మెల్యే పోచారం

నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా పోతంకల్ మండలంలోని రామ్ గంగానగర్ గ్రామంలో 200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజు, పార్టీ కార్యకర్తలు అధికారులు గ్రామ పెద్దలు పరిశీలించి కాంట్రాక్టర్లతో నిర్మాణ పనులు విషయం చర్చించి వారి వద్ద నుండి నిర్మాణానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకుని వారికి తగిన సలహాలు సూచనలు చెప్పారు అదేవిధంగా రామ్ గంగానగర్ గ్రామంలో గ్రామపంచాయతీ నూతన భవనానికి భూమి పూజ చేసి అట్టి భవనానికి ప్రభుత్వం వారు 20 లక్షలు మంజూరు చేసి ఇచ్చి దబ్బుని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో అధికారులు పార్టీ కార్యకర్తలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విశ్వాసం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం' లక్ష్యంగా మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలన

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంటోనీ రెడ్డి

(కరీంనగర్)

విశ్వాసం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం' లక్ష్యం గా మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలన కొనసాగిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంటోనీ రెడ్డి అన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని బీజేపీ శ్రేణులు చేపట్టాల్సిన ప్రత్యేక సేవా, ప్రజాహిత కార్యక్రమాల కోసం తిమ్మాపూర్ బిజెపి మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహాత్మా నగర్ లోని శ్రీ తపాల లక్ష్మీనరసింహస్వామి దేవాలయ కళ్యాణమండపంలో మండల బిజెపి ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ విజయాలు , 12 ఏళ్ల ప్రగతినీ వివరించారు , పార్టీ నిర్ణయించిన ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. గడిచిన 12 ఏళ్లలో అవినీతి రహిత పాలన, ఆర్థిక వ్యవస్థ బలోపేతం, ఆయుష్మాన్ భారత్, ఉచిత బియ్యం పంపిణీ తో పాటు అనేక సంక్షేమ పథకాలు, చారిత్రక , సాహసోపేత బిల్లులు , అన్ని రంగాలలో దేశం సాధించిన ప్రగతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లడానికి ప్రయత్నం చేయాలన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి... చింతం శ్రీనివాస్.. పర్యావరణ పరిరక్షణతోనే మానవాళికి భవిష్యత్తు ఉంటుందని, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తిమ్మాపూర్ బిజెపి మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాల పాలనను పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని అమ్మ పేరుతో ఓ మొక్కను నాటే కార్యక్రమం తిమ్మాపూర్ మండలంలోని అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల్లో చేపట్టారు. మహాత్మా నగర్ గ్రామపంచాయతీ పరిధిలో స్థానిక బిజెపి శ్రేణులు చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో చింతం శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తుందన్నారు. గడిచిన 12 ఏళ్ల కాలంలో మోడీ ప్రభుత్వం కేవలం

ఆర్థిక, సాంకేతిక రంగాలకే కాకుండా పర్యావరణ రక్షణకు కూడా సమాన ప్రాధాన్యతనిచ్చిందన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలకు బిజెపి శ్రీకారం చుట్టిందని, ఆ దిశలోనే'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడడానికి చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తమ తల్లి జ్ఞాపకార్థం , గౌరవార్థం ఒక మొక్కను నాటాలని ఆయన కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మండలాధ్యక్షుడు చింతం శ్రీనివాస్, , జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్ , గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, బోనాల మోహన్,కోయ్యడ శ్రీనివాసు,ఎర్రోజు లక్ష్మణ్,తమ్మనవేని రాజుయాదవ్, బిజెవైయం మండల అధ్యక్షుడు గడ్డం అరుణ్ ,కానుగంటి మదుకర్ రెడ్డి,బుర్ర శ్రీనివాసు,గడ్డం శ్రీనివాస్ రెడ్డి,రామిడి మహేందర్ రడ్డి,కన్నం సాయి, ఆంజనేయులు, జక్కోజు అనిల్,ఉప్పులేటి జీవన్,ప్రదీప్ రెడ్డి,వేల్పుల ఓదెలు,ఈశ్వర చారి, మల్లేశం,మదుసూదన్ రెడ్డి, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, బిఎల్ఎ2 ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బంది పెట్టే రాజకీయ జిమ్మిక్కులు మానుకోవాలి

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి: బీఆర్ఎస్ నేత మహ్మద్ అజీమ్

(కరీంనగర్)

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయ నిరసనల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆర్ఎస్ నాయకుడు మహ్మద్ అజీమ్ విమర్శించారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే రోడ్లపై ఆందోళనలు చేయడం కంటే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు న్యాయం చేయాలనే నిజమైన సంకల్పం ఉంటే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేయాలని అన్నారు. అయితే అలాంటి చర్యలకు దూరంగా ఉంటూ, రాష్ట్రంలో రాజకీయ లబ్ధి కోసం మాత్రమే ఆందోళనలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్, బీజేపీ వైఖరిపై విమర్శలు

కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజల ముందు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నప్పటికీ, ప్రజా ప్రయోజనాల విషయంలో రెండింటి వైఖరి ఒకేలా కనిపిస్తోందని అజీమ్ పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని విమర్శించారు.

రైతుల సమస్యలను విస్మరించారు

రాష్ట్రంలోని రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతున్నప్పటికీ రైతులకు భరోసా కల్పించే చర్యలు తీసుకోవడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన సమీక్షా సమావేశాలు కూడా నిర్వహించలేదని విమర్శించారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

రాజకీయ కార్యక్రమాల కంటే ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని మహ్మద్ అజీమ్ సూచించారు. ప్రజా సమస్యలను విస్మరించి రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తే ప్రజలు తగిన సమయంలో తీర్పు ఇస్తారని హెచ్చరించారు.

35 ఏళ్ల సుదీర్ఘ సేవలు అమోఘం..

హోంగార్డు నాయిని రాజేందర్‌కు సీపీ గౌస్ ఆలం ఘన వీడ్కోలు..

(కరీంనగర్)

పోలీసు శాఖలో హోంగార్డుగా చేరి, 35 సంవత్సరాలుగా నిస్వార్థంగా సేవలందించిన నాయిని రాజేందర్ పదవీ విరమణ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, రాజేందర్ ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, కమీషనరేట్ కేంద్రంలో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వహించిన నాయిని రాజేందర్, తన 35 ఏళ్ల సర్వీసులో ఎంతో అంకితభావంతో, నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. పోలీసు శాఖలో హోంగార్డుల పాత్ర కీలకమని, క్షేత్రస్థాయిలో వారు అందించే సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన రాజేందర్ శేష జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడవాలని ఆయన ఆకాంక్షించారు.

అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది సమక్షంలో నాయిని రాజేందర్ కు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. తన సర్వీసు కాలంలో తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉంటూ, విధుల్లో క్రమశిక్షణ పాటించిన ఆయనను పలువురు అధికారులు అభినందించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (హోంగార్డ్స్) శ్రీధర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవి మరియు కమిషనరేట్‌కు చెందిన ఇతర పోలీసు అధికారులు, హోంగార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావన కలిగి ఉండాలి..

టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ధర్మచార్యులు మేంగాని చంద్రశేఖర్.... ఎల్లంకి వైకుంఠం

పెద్దపల్లి

ప్రతి ఒక్కరికి భక్తి భావన అవసరమని, ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ పెద్దపల్లి జిల్లా ధర్మచార్యులు మేంగానీ చంద్రశేఖర్, ధర్మ ప్రచార పరిషత్ వ్యాఖ్యాత ఎల్లంకి వైకుంఠం లు అన్నారు.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు రెండు నుంచి ఆరు వరకు నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా నేడు భజన కార్యక్రమాలు కోలాహలం తో ఈ కార్యక్రమం ముగిసింది, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ పెద్దపల్లి జిల్లా ధర్మాచార్యులు మెంగని చంద్రశేఖర్ పాల్గొని భక్తి భావం గురించి, టీటీడి కార్యక్రమాల గురించి వివరించారు,వాసవి మాత దేవాలయం చైర్మన్ చకిలం మారుతి, పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు కొమురవెల్లి రామ్మూర్తి , అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్, వాసవి క్లబ్ అధ్యక్షులు రామీడి రవీందర్ పలువురు పాల్గొన్నారు, అనంతరం ఆలయ కమిటీ శాలువాలతో సత్కరించడం జరిగింది, అర్చకులు వల్లకొండ మరం మహేష్ ప్రత్యేక పూజలు చేశారు, అనంతరం ఈ కార్యక్రమాన్ని టిటిడి ద్వారా ఉమ్మడి కరీంనగర్ వరంగల్ జిల్లాల అధికారి రామిరెడ్డి కృష్ణమూర్తి కి ఈ గ్రామం ఈ దేవాలయ భక్త బృందం తరపున చంద్రశేఖర్, వైకుంఠం లు కృతజ్ఞతలు తెలిపారు, ఈ సందర్భంగా టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ వ్యాఖ్యాత ఎల్లంకి వైకుంఠం వచ్చిన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయడంతో పాటు, అమ్మవారిప్రసాదం,మిఠాయిలు పంపిణీ చేశారు... పెద్ద ఎత్తున భక్తులు మహిళలు పాల్గొన్నారు...

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం : మున్సిపల్ చైర్మన్

(సూర్యాపేట)

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురంలో ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో హుజూర్ నగర్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. స్మశాన వాటిక పనులు చేపడతామని, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునర్నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. గోవిందపురం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ హాల్లో ఫ్యాన్లను ఏర్పాటు చేసేందుకు వెంటనే నిధులు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కమ్యూనిటీ హాలుకు వెంటనే విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గోవిందపురంలో అభివృద్ధి పనులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున రావు, కమిషనర్ సతీష్ కుమార్ సహాయ సహకారాలు అందించాలని

ఈ సందర్భంగా 8 వార్డు కౌన్సిలర్ కోలా ఉదయభాను కోరారు. ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 30 లక్షలు, ప్రభుత్వ పాఠశాల పనులకు అదనంగా మరో 20 లక్షలు నిధులు మంజూరు చేయాలని ఆమె కోరారు. స్మశాన వాటిక అభివృద్ధికి 40 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున రావు, కమిషనర్ సతీష్ కుమార్, ఏఈ వినోదు, శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, విద్యుత్ ఎ.రాంప్రసాద్, ఆయుష్ను డాక్టర్ చందన్ కుమార్, ఇందిరాల రామకృష్ణ, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రాజశేఖర్, వివిధ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా పరిష్కరించడమే ప్రధాన లక్ష్యం

(ములుగు)

ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ 4వ వార్డులో తాగునీటి ఇబ్బందులు తలెత్తిన విషయం వార్డు నెంబర్ ఎంపెల్లి రాజు తెలపగా వెంటనే సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు తక్షణమే స్పందించారు. వార్డు ప్రజల నీటి సమస్యను తీర్చేందుకు స్వయంగా క్షేత్రస్థాయికి చేరుకుని, కొబ్బరికాయలు కొట్టి చేతిపంపు పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడటమే తమ మొదటి ప్రాధాన్యతని, వార్డులో నీటి సమస్య త్వరలోనే పూర్తిగా తొలిగిపోతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్ గౌడ్, తాడూరి రఘు, ఉపసర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, వావిలాల ముత్తయ్య, మాజీ వార్డ్ మెంబర్ దేపాక మల్లమ్మ, దేపాక శ్రీరామ్, వావిలాల రామ్ నర్సయ్య, వావిలాల కిషోర్, కొండాయి చిన్ని, నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సమాజ పరిరక్షణ బాధ్యత అందరూ తీసుకోవాలి : సీఐ

(భూపాలపల్లి)

ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నిషేధిత మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మరిపెడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ సూచించారు. మరిపెడ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శబరీష్ నేతృత్వంలో జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసు శాఖ అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. గంజాయి నివారణ కోసం పోలీసు శాఖ అన్ని రకాల చర్యలు చేపడుతోందని, అందులో భాగంగానే మరిపెడ సర్కిల్ పరిధిలో గంజాయి పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక కిట్లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు.

ఇక పై అనుమానిత వ్యక్తులను సంఘటనా స్థలంలోనే గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువత పెడదారి పట్టకుండా ఫోర్త్ ఎస్టేట్ పోలీసులకు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలు, నిషేధిత మత్తు పదార్థాల రవాణా, నకిలీ వస్తువుల విక్రయాలకు సంబంధించిన

సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో యువత పెడదారి పట్టకుండా, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండేందుకు అన్ని రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై నిఘా ఉంచి, క్రీడలు మరియు విద్య పట్ల ఆసక్తి పెంపొందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో గంద్రాతి సతీష్, అదనపు ఎస్ఐ మహబూబ్ అలీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి..

(నిర్మల్)

ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేలా డిగ్రీ కళాశాల అధ్యాపకులు విద్యార్థుల ఇంటికి వెళుతున్నారు. విద్యార్థుల్లో ప్రభుత్వ విద్య పై నమ్మకం కలిగించేలా స్పెషల్ డ్రైవ్ చేస్తున్నారు. నిర్మల్‌లో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా వారం రోజులు పాటు విద్యార్థుల ఎన్రోల్మెంట్ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సుధాకర్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విదార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మల్ లో చేరి తమ బంగారు భవిష్యత్ కు బాటలు వేసుకోవాలని అన్నారు.

తమ కళాశాలలో అంకితభావం, అనుభవజ్ఞులైన అధ్యాపకులు బోధిస్తారని, అధునాతనమైన కంప్యూటర్ లాబ్స్, సైన్స్ లాబ్స్, డిజిటల్ గ్రంథాలయం, నిర్మల్ జిల్లాలోనే అత్యంత విశాలమైన క్రీడా మైదానం, ఎన్సీసీ కలిగిన ఏకైక కళాశాల తమదని, ప్రభుత్వ ఉపకార వేతనాలు పొందే అవకాశం విద్యార్థులకు ఉందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని నిర్మల్ జిల్లాలోని విద్యార్థులందరూ వినియోగించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ యు.గంగాధర్, ఏఓ నాగ శ్రీనివాస్, దోస్త్ కో ఆర్డినేటర్ కుంట శ్రీహరి అధ్యాపకులు డాక్టర్ పిజి రెడ్డి, సూర్య సాగర్, డాక్టర్ శ్రీనివాస్, కట్టా రమేష్ రెడ్డి, డాక్టర్ హేమలత, సుభాష్, డాక్టర్ పవన్, డాక్టర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY NYALAKONDA ANIL RAO PRINTED AT BALAJI PRINTING PRESS 4-4-85, TILAK ROAD, KARIMNAGAR. PUBLISHED FROM H.NO. 1-5, NAGIREDDYPUR VILLAGE, GANGADHARA MANDAL, DIST KARIMNAGAR- TELANGANA EDITOR :NYALAKONDA ANIL RAO. janamgonthu@gmail.com. cell: 9542226669